
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



కాళేశ్వరాలయంలో పూజలు చేస్తున్న కేటీఆర్



తలసరి ఆదాయంలో జయశంకర్ జిల్లాకు

ఐదో స్థానం



- 'ఉపాధి' పనిదినాల కల్పనలో ఆరో స్థానంలో జనగామ
- సామాజిక ఆర్థిక సర్వేలో వెల్లడి

హనుమకొండ, జూలై 26 (ఆంధ్రజ్యోతి): తలసరి ఆదాయంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా రాష్ట్రస్థాయిలో ఐదో స్థానంలో నిలవగా హనుమకొండ జిల్లా చివర స్థానంలో ఉంది. గురువారం అసెంబ్లీలో ఉపముఖ్యమంత్రి, రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కతో బడ్జెట్‌తో పాటు ప్రవేశపెట్టిన ఆర్థిక, సామాజిక సర్వే వెల్లడించింది. ఆ మేరకు జయశంకర్ భూపాలపల్లి జిల్లా తల సరి ఆదాయం రూ.2,71,555 కాగా.. వరంగల్ రూ.2,22,640తో 15వ స్థానంలో నిలిచింది. జనగామ జిల్లా రూ.2,17,277తో 18వ స్థానం, మహబూబాబాబాద్ జిల్లా రూ.1,99,588తో 23వ స్థానం, ములుగు జిల్లా రూ.1,97,539తో 25వ స్థానం, హనుమకొండ జిల్లా రూ.186,784తో 26వ స్థానంలో నిలిచింది.

మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద గ్రామీణ ప్రాంత ప్రజలకు పని దినాలు కల్పించే విషయంలో జనగామ జిల్లా రాష్ట్రంలోనే ఆరో స్థానంలో నిలవగా, మహబూబాబాద్ జిల్లా 31వ స్థానంలో ఉంది. జనగామ జిల్లాలో 2023-24 సంవత్సరంలో 24.80లక్షల పనిదినాలను కల్పించాలని లక్ష్యంగా నిర్ణయించగా, దానిని మించి 30.5లక్షల పనిదినాలను (123 శాతం) పనిదినాలను కల్పించి రాష్ట్రంలో ఆరో స్థానంలో నిలిచింది. వరంగల్ జిల్లాలో 17.5లక్షల పనిదినాలను కల్పించాలని లక్ష్యంగా నిర్ణయించగా అంతకు మించి 20.3లక్షల (116 శాతం) కల్పించి రాష్ట్ర స్థాయిలో 15వ స్థానంలో నిలిచింది. హనుమకొండ జిల్లా 19.3లక్షల పని దినాలను కల్పించాలన్నది లక్ష్యంగా, 21.9 లక్షల పని దినాలు (114 శాతం) కల్పించడంతో 17వ స్థానంలో, ములుగు జిల్లాలో 12.1 లక్షల పనిదినాలను కల్పించాలన్నది లక్ష్యంగా 13.4 లక్షల పని దినాలు (111 శాతం) కల్పించడంతో 24వ స్థానంలో నిలిచింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా 19.9 లక్షల పనిదినాలను కల్పించాలన్నది లక్ష్యం కాగా, 21.2 లక్షల పనిదినాలతో (106 శాతం) 29 స్థానంలో మహబూబాబాద్ జిల్లా 53.3 లక్షల పని దినాలు లక్ష్యం కాగా, 55.9 (105శాతం) పనిదినాలతో రాష్ట్రస్థాయిలో అట్టడుగున 31 స్థానంలో నిలిచింది.

జిల్లాల వారీగా భూ కమతాలిలా..

రైతులు వ్యవసాయ భూములను కలిగి ఉండడంలో రాష్ట్రస్థాయిలో జనగామ జిల్లా ఐదోస్థానంలో నిలిచింది. అతి తక్కువ భూములు కలిగి ఉన్న జిల్లా వరంగల్ అని ఆర్థిక సామాజిక సర్వే రిపోర్టులో పేర్కొన్నారు. జనగామ జిల్లాలో సరాసరి ల్యాండ్ హోల్డింగ్స్ 0.95 హెక్టార్లు కాగా, ములుగు జిల్లాలో 0.92హెక్టార్లు, మహబూబాబాద్ జిల్లాలో 0.87 హెక్టార్లు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 0.85 హెక్టార్లు, హనుమకొండ జల్లాలో 0.75 హెక్టార్లు, వరంగల్ జిల్లాలో 0,74 హెక్టార్లు కలిగి ఉన్నారు. ల్యాండ్ హోల్డింగ్ అనేది ప్రధానంగా భూమిని కలిగి ఉన్న లేదా సొంతం చేసుకునే స్థితి లేదా వాస్తవంతో వ్యవహరించే భావన. దేశ ఆర్థిక, రాజకీయ ప్రక్రియలపరంగా భూమి కలిగి ఉండడం (హోల్డింగ్) ఒక ముఖ్యమైన పాత్రను పోషిస్తుంది.

అడవులు, వన్యప్రాణులు

కాళేశ్వరం సర్కిల్ పరిధిలో మొత్తం అడవి 22,65,548.9 ఎకరాలున్నట్టు ఆర్థిక సామాజిక సర్వేలో పేర్కొన్నారు. ఇందులో రిజర్వు ఫారెస్టు 21,17,394.3 ఎకరాలు రక్షిత అడవి 1,19,999 ఎకరాలు కాగా, అన్ క్లాసిఫైడ్ ఏరియా 28,155.6 ఎకరాలు ఉంది. ఏటూరునాగారం వన్యప్రాణి సంరక్షణ కేంద్రం 803 చదరపు కిలోమీటర్లు, మహబూబాబాద్, వరంగల్‌తో కూడిన పాకాల వన్యప్రాణి సంరక్షణ కేంద్రం 860.2 చదరపు కిలోమీటర్లున్నట్టు తెలిపింది.

మేడిగడ్డ బ్యారేజీ బ్లాక్-6 వద్ద కేటీఆర్ బృందం



- ముక్తీశ్వరాలయం, త్రివేణి సంగమాల వద్ద ప్రత్యేక పూజలు
- కన్నెపల్లి పంప్‌హౌస్, మేడిగడ్డ బ్యారేజీల పరిశీలన
- కాళేశ్వరం నీటిని వెంటనే ఎత్తిపోయాలి
- విలేకరుల సమావేశంలో మంత్రి కేటీఆర్
- చిల్లర ప్రచారాలు మానుకోవాలని ప్రభుత్వానికి హితవు

మూడున్నర గంటలు..

కాళేశ్వరంలో సాగిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేల బృందం పర్యటన

మహదేవపూర్ రూరల్ / మహదేవ్‌పూర్, జూలై 26 : బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నేతల బృందం శుక్రవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని కాళేశ్వరంలో పర్యటించింది. సుమారు మూడున్నరగంటల పాటు ఆ బృందం పర్యటన సాగగా.. కాళేశ్వరం ప్రాజెక్టులో కీలకమైన కన్నెపల్లి లక్ష్మీ పంపుహౌస్, మేడిగడ్డ బ్యారేజీలను నేతలు సందర్శించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్ నేతృత్వంలో ఉదయం 10గంటలకు కాళేశ్వరం చేరుకున్న ప్రజాప్రతనిధులు, నేతలు తొలుత శ్రీకాళేశ్వర ముక్తీశ్వరాలయానికి చేరుకోగా వారికి అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో రుద్రాభిషేకం, ప్రత్యే క పూజలు చేశారు. ఆ తర్వాత 10.30 గంటలకు శుభనందాదేవి ఆలయాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా కేటీ ఆర్, ఎమ్మెల్యేల బృందాన్ని స్వామివారి శేషవస్త్రాలతో సత్కరించి తీర్థప్రసాదా లు అందజేశారు. అక్కడి నుంచి 10.45 గంటలకు గోదావరి నది వద్దకు చేరుకున్న కేటీఆర్, నేతలు ప్రత్యేక పూజలు చేసి కన్నెపల్లి పంప్‌హౌజ్‌కు బయలు దేరి వెళ్లి.. 11.05కు అక్కడికి చేరుకుని పంప్‌హౌజ్‌ను పరిశీలించారు. 11.10 గంటకు మీడియా సమావేశంలో మాట్లాడి మేడిగడ్డకు తరలారు. మధ్యాహ్నం 12.45గంటలకు మేడిగడ్డ బ్యారేజీ బ్లాక్ 6 వద్ద గోదావరినది ప్రత్యేక పూజలు చేసి వరద ప్రవాహాన్ని పరిశీలించారు. 1.35 గంటలకు మేడిగడ్డ బ్యారేజీ వంతెనపై నుంచి బయటకు వచ్చి చెన్నూరుకు బయలుదేరి వెళ్లిపోయారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న కేటీఆర్, చిత్రంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నేతలు



కాళేశ్వరంలో గోదావరికి పూజలు చేస్తున్న కేటీఆర్

రాజకీయాలకు పోయి రైతులను ఆగం చేయొద్దు : కేటీఆర్

కాళేశ్వరం ప్రాజెక్టులోని కన్నెపల్లి పంపుహౌస్ నుంచి వెంటనే నీటిని ఎత్తిపోసి, ఎగువ గోదావరిలోని రిజర్వాయర్లను నింపాలని, రాజకీయాలకు పోయి రైతులను ఆగం చేయొద్దని కేటీఆర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కన్నెపల్లి లక్ష్మీపంపుహౌస్ సందర్శించిన అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం చిల్లర ప్రచారాలు మానుకోవాలని హితవు పలికిన ఆయన ఈ ప్రాజెక్టు రాష్ట్రానికి వరప్రదాయిని అని, కేసీఆర్ ప్రారంభించిన ఈప్రాజెక్టు ద్వారా రైతులకు మేలు జరిగితే తమకు మనుగడ ఉండదనే దురుద్దేశంతో కాంగ్రెస్ ప్రభుత్వం దుష్ప్రచారాలు చేస్తోందని మండిపడ్డారు. అన్నాదతల ఆకలి తీర్చే కాళేశ్వరం ప్రాజెక్టు పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. 'మేడిగడ్డ కుంగిపోయింది.. కాళేశ్వరం కొట్టుకుపోయింది..' అని దుష్ప్రచారం చేసే కాంగ్రెస్ నాయకులు బ్యారేజీని సందర్శించాలని హితవు పలికారు. సుమారు 10లక్షల క్యూసెక్కుల పైచిలుకు వరద ఉన్న వరద ప్రవాహాన్ని కూడా బ్యారేజీ తట్టుకుని నిలబడిందని, ఇది కాంగ్రెస్ నాయకుల కళ్లకు కనిపించడం లేదని దుయ్యబట్టారు. ఇప్పటికైన కాంగ్రెస్ నాయకులు కళ్లతెరిచి ప్రాజెక్టును చూసి మాట్లాడాలన్నారు. చిన్న చిన్న లోపాలను చూపించి మొత్తం ప్రాజెక్టే పనికి రాదనే విధంగా మాట్లాడటం హాస్యాస్పదమన్నారు. అసెంబ్లీ సమావేశాలు ముగిసే ఆగస్టు 2వ తేదీ నాటికి ప్రభుత్వం స్పందించి కాళేశ్వరం నీళ్లు ఎత్తిపోయాలని, లేదంటే తామే వరంగల్, మహబూబాబాద్, డోర్నకల్, పాలేరు, సూర్యాపేట, భువనగిరి, సిద్దిపేట, కామారెడ్డి, నిజామాబాద్, కరీంనగర్ ప్రాంతాల నుంచి 50వేలమందికిపైగా రైతులను సమీకరించి వారి చేతుల మీదుగానే కన్నెపల్లి పంపుహౌస్ మోటార్లను ఆన్‌చేసి కాళేశ్వరం జలాలను తరలించుకుంటామని కేటీఆర్ హెచ్చరించారు. మాజీ మంత్రులు గంగుల కమలాకర్, జగదీశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ రాజకీయం చేసేందుకు తాము

మిగతా 6వ పేజీలో..

మేడారం సారలమ్మ పూజారి మృతి

- వారం రోజుల్లోనే మరో ఘటన



పూజారి కాక సంపత్ (ఫైల్)

మేడారం, జూలై 26 : ములుగు జిల్లా వనదేవతల సన్నిధి మేడారంలో మరో విషాదం చోటుచేసుకుంది. సారలమ్మ ప్రధాన పూజారి కాక సంపత్ (38) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందారు. సమ్మక్క పూజారి మల్లెల ముత్తయ్య ఈనెల 20న మృతి చెందగా వారం రోజుల వ్యవధిలోనే మరో ఘటన చోటుచేసుకోవడం విషాదాన్ని నింపింది. కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న సంపత్ ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారు. చికిత్స పొందుతున్నా ఆరోగ్యం కుదటపడలేదు. తన స్వగ్రామం తాడ్వాయి మండలం కన్నేపల్లి గ్రామంలో తుది శ్వాస విడిచారు. కొన్ని రోజులుగా అనారోగ్య సమస్యలతో ఆయన బాధపడుతున్నారు. మృతుడికి భార్య ఆమని, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. కుమారుల్లో ఒకరు అంగవైకల్యంతో బాధపడుతున్నాడు. సంపత్ మృతితో ఆయన కుటుంబం శోక సంద్రంలో మునిగిపోయింది.

బ్యాంకు సిబ్బందిపై ఎమ్మెల్యే కడియం ఆగ్రహం

రుణమాఫీ అమలులో జాప్యం చేస్తున్నారంటూ వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీకి ఫిర్యాదు



బ్యాంకు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే కడియం

చిలుపూర్, జూలై 26: రైతు రుణమాఫీ అమలులో నిర్లక్ష్యం చేస్తున్నారంటూ ఇండియన్ బ్యాంకు అధికారులపై స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన మల్కాపూర్‌లో ఇండియన్ బ్యాంకును సందర్శించి అధికారులతో మాట్లాడారు. రైతుల ఖాతాలకు సంబంధించి ఆధార్ నంబర్ ఎంట్రీ సందర్భంగా దొర్లిన తప్పులే ఇందుకు కారణమని గుర్తించారు. బ్యాంకు సిబ్బంది నిర్లక్ష్యం, అధికారుల అలసత్వం వల్లే సకాలంలో రుణమాఫీ కాకపోవడంతో 3625 మంది రైతులు ఇబ్బంది పడుతున్నారని మండిపడ్డారు. ఈ విషయమై రాష్ట్ర వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ రఘునందన్ రావుతో ఫోన్లో మాట్లాడారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఆధార్ నంబర్ల రీ ఎంట్రీతో పాటు, రుణమాఫీని అమలు చేసేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అర్హులైన ప్రతీ రైతుకు రుణమాఫీని అందించేందుకు తాను కృషి చేస్తానని, రైతులు ఆందోళన చెందవద్దని భరోసా ఇచ్చారు. బ్యాంకు పరిధిలో ఉన్న 8 గ్రామాల రైతులు తమ సమస్యల పరిష్కారం కోసం స్థానిక ఏఈవోలను సంప్రదించాలని సూచించారు. పహనీలతోనే క్రాప్ లోన్లు మంజూరు చేయాలని సూచించారు. పట్టాదారు పాస్ బుక్ తీసుకోవడం తగదని బ్యాంకు సిబ్బందిని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీఏవో వినోద్‌కుమార్, లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీధర్, ఇండియన్ బ్యాంక్ మేనేజర్ గోన గోపిరాజు, తహసీల్దార్ సరస్వతి, ఎమ్మార్వై కలువల శ్రీనివాస్, ఏఈవో బూర్ల నర్సింహులు, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు గడ్డమీది సురేశ్, నాయకులు బొమ్మిశెట్టి బాలరాజు, చల్లా రాజ మహేందర్ రెడ్డి, ఏడవెళ్లి మల్లారెడ్డి, పోలేపల్లి రంజిత్‌రెడ్డి, మామిడాల లింగారెడ్డి, రంగు రమేష్, తాటి సునిల్, పసుల వెంకటేష్, మాదిరెడ్డి యశ్వంత్ రెడ్డి, నామాల మల్లేషం, కొయ్యడ రాందాస్, రవిందర్, బాలరాజు, శ్రీనివాస్, నారాయణరెడ్డి, గొడుగు రవి తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగంపై సర్కారు చిన్నచూపు

ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు దడిగే సందీప్



జనగామలో రాస్తారోకో చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

జనగామ రూరల్, జూలై 26: కాంగ్రెస్ ప్రభుత్వం ఒంటెత్తు పోకడలకు పోతోందని, విద్యారంగాన్ని చిన్నచూపు చూస్తోందని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు దడిగే సందీప్ విమర్శించారు. బడ్జెట్‌లో విద్యారంగానికి తక్కువ నిధులు కేటాయించడాన్ని నిరసిస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు శుక్రవారం జిల్లా కేంద్రంలోని నేహ్రూ పార్కు వద్ద రాస్తారోకో చేసి బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సందీప్ మాట్లాడుతూ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రతీ మండలానికి ఒక తెలంగాణ మోడల్ ఇంటర్నేషనల్ పాఠశాల, రెండు గ్రామాలకు ఒక గురుకుల పాఠశాల ఏర్పాటు చేస్తామని చెప్పి బడ్జెట్లో దాని ఊసే ఎత్తలేదని మండిపడ్డారు. యూనివర్సిటీల అభివృద్ధికి రూ.500 కోట్లు ఎలా సరిపోతాయని ప్రశ్నించారు. తక్షణమే బడ్జెట్‌ను సవరించి విద్యారంగానికి నిధులు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆర్యా, రాజేష్, రాజు, అరుణ్, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనం: డీటీఎఫ్

జనగామ కల్చరల్: విద్యారంగానికి రాష్ట్ర బడ్జెట్‌లో తక్కువ నిధులు కేటాయించడం విద్యారంగం పై ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని డీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.లింగారెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో డీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు బి.చొక్కయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పదేళ్లుగా నిర్లక్ష్యానికి గురైన విద్యారంగానికి ఇపుడు కేటాయించిన 7.31 శాతం నిధులు ఏ మూలకు సరిపోవన్నారు. విద్యారంగం బాగుపడాలంటే 20 శాతం నిధులు అవసరమన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వి.దివాకర్‌రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు షరీఫ్, దూడయ్య, యాదయ్య, వివిధ మండలాల బాధ్యులు డి.శ్రీనివాస్, ఎం.అంజనేయులు, టి.శ్రీనివాసులు, ఎండి.అఫ్సర్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో తాగునీటి కొరత తీరుస్తాం


ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

పాలకుర్తి, జూలై 26: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు తాగునీటి సమస్య లేకుండా పరిష్కరిస్తామని ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. శుక్రవారం ఆమె పాలకుర్తిలో సాంఘిక సాంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను సందర్శించి ఎస్‌డీఎఫ్ నిధులు రూ. 2 లక్షలు, ఎంపీటీసీల నిధులు రూ.2 లక్షలు మొత్తం రూ.4 లక్షలతో ఏర్పాటు చేసిన వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సర్కార్ స్కూళ్లలో చదువుతున్న బడుగు బలహీన వర్గాల విద్యార్థుల కోసం తమ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతోందన్నారు. నియోజకవర్గంలోని పలు పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాలలను ఎంపిక చేసి మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నామన్నారు. అనంతరం పాఠశాలలో రికార్డులను తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు ఎందరు.. విద్యార్థులు ఎందరు ఉన్నారని ప్రిన్సిపాల్ స్వరూపను అడిగి తెలుసుకున్నారు. తర్వాత తరగతికి వెళ్లి విద్యార్థులతో మాట్లాడారు. బాగా చదువుతున్నారా, ఉపాధ్యాయులు అన్ని సబ్జెక్టులు చెబుతున్నారా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో రాములు, ఆర్‌డబ్ల్యు ఎస్ సంధ్య, ఏఈ ప్రశాంతి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యఆనారాయణ, మండల అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి, మార్కెట్ మాజీ చైర్మన్ ఎర్రబెల్లి రాఘవరావు, మాజీ సర్పంచు గంగు కృష్ణమూర్తి, నాయకులు పెనగొండ రమేష్, సలేంద్ర వెంకన్న, పులి గణేష్, సలేంద్ర సంపత్ పాల్గొన్నారు.



పాలకుర్తి టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్‌లో వాటర్ ప్లాంట్ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

మత్స్యశాఖ జిల్లా అధికారిగా రాణాప్రతాప్



బాధ్యతలు స్వీకరిస్తున్న రాణాప్రతాప్

జనగామ, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మత్స్యశాఖ జిల్లా అధికారిగా ఎన్.రాణాప్రతాప్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన బి.నాగులు కరీంనగర్ జిల్లా మత్స్యశాఖ అధికారిగా బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో నారాయణపేట జిల్లా మత్స్యశాఖ అధికారిగా పనిచేస్తున్న రాణాప్రతాప్ జనగామకు వచ్చారు. కాగా.. రాణాప్రతాప్ జనగామ జిల్లా ఏర్పడగానే 2016లో మొదటి జిల్లా మత్స్యశాఖ అధికారిగా నెల రోజులపాటు పనిచేశారు. అనంతరం 2022 జనవరి 18 నుంచి జూన్ 8 వరకు ఆరు నెలల పాటు మరోసారి పనిచేశారు. అదేసమయంలో జనగామ నుంచి నారాయణపేటకు డిప్యుటేషన్‌పై వెళ్లి తిరిగి ప్రస్తుతం జనగామకే వచ్చారు.

దేవాదులకు కేవలం రూ.20కోట్లేనా?

తక్కువ నిధుల కేటాయింపుపై కడియం, మంత్రులు జవాబు చెప్పాలి

మాజీ మంత్రి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండె విజయరామారావు



స్టేషన్‌ఘన్‌పూర్‌లో మాట్లాడుతున్న జీవీఆర్

స్టేషన్‌ఘన్‌పూర్, జూలై 26: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన వార్షిక బడ్జెట్‌లో దేవాదుల పథకానికి కేవలం రూ.20కోట్లు కేటాయించడం దురదృష్టకరమని మాజీ మంత్రి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండె విజయరామారావు విమర్శించారు. శుక్రవారం డివిజన్ కేంద్రంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపుల్లో గారడీ చేసిందని, దేవాదుల పథకం కింద వందల కోట్ల అభివృద్ధి పనులు జరుగాల్సి ఉండగా తక్కువ నిధులు కేటాయించడం దేవాదులను విస్మరించడమేనని అన్నారు. వరదకాలువ అభివృద్ధికి నిధులు కేటాయించకపోవడం దుర్మార్గమన్నారు. వరదకాలువను అభివృద్ధి చేస్తే గ్రావిటీ ద్వారా దేవాదుల ప్రాజెక్టులోకి జలాలు వస్తాయన్నారు. హుస్నాబాద్ సమీపంలోని పలు గ్రామాల వరకు వచ్చిన వరదకాలువను అభివృద్ధి చేయాలన్నారు. గృహ నిర్మాణాలకు ఎస్సీలకు రూ.6లక్షలు, బీసీలకు రూ.5లక్షలు ఇస్తామని ప్రకటించారని, అవి ఎలా సరిపోతాయని ప్రశ్నించారు. హామీలు పెద్దగా ఉండి కేటాయింపులు తక్కువ చేసి ప్రజలను మోసం చేయాలని చూస్తున్నారన్నారు. రైతు రుణమాఫీ, రైతు భరోసా, గృహ జ్యోతి, మహాలక్ష్మి లాంటి పథకాలకు రేషన్‌కార్డు ఉండాలనే నిబంధన పెట్టడం సరికాదన్నారు. 2008 నుంచి ఇప్పటివరకు కొత్త రేషన్‌కార్డులు మంజూరి చేయకుండా పథకాలకు రేషన్‌కార్డుతో ముడిపెట్టడం సరికాదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారంటీలకు బడ్జెట్ కేటాయింపులు సరిపోవని గుర్తు చేశారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ కన్వీనర్ ఐలోని అంజిరెడ్డి, పార్టీ మండలాధ్యక్షుడు సట్ల వెంకటరమణ, ప్రధానకార్యదర్శి బూర్ల విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

మూడున్నర గంటలు..

(5వ పేజీ తరువాయి)

కాళేశ్వరం ప్రాజెక్టు సందర్శనకు రాలేదని, బీడువారిన భూములకు నీరందించి రైతులకు న్యాయం చేయాలని కోరేందుకు వచ్చామని స్పష్టం చేశారు. తొలుత గంగుల మాట్లాడుతూ ఇప్పటికిప్పుడు కన్నెపల్లి పంప్‌హౌస్ మోటార్లు ఆన్‌చేస్తే అన్నారం, సుందిళ్ల ఎల్లంపల్లి ప్రాజెక్టుల ద్వారా మానేరు డ్యామ్‌ను నింపే అవకాశం ఉన్నా కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరిస్తోందని మండిపడ్డారు. జగదీశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టుకు కన్నెపల్లి పంప్‌హౌస్ కీలకమని, దీనిని రన్ చేస్తేనే ప్రాజెక్టు పరిధిలో ఉన్న అన్ని ప్రాంతాలకూ నీరందుతుందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ప్రారంభానికి ముందున్న ఆయకట్టు మాత్రమే కొనసాగేదని, అనంతరం కొన్ని లక్షల ఎకరాల కొత్త ఆయకట్టు తయారైందని వివరించారు. కాంగ్రెస్ చేసే కుట్రలను తిప్పికొట్టి రైతులకు నీరందించడమే లక్ష్యంగా తాము కాళేశ్వరం ప్రాజెక్టు సందర్శనకు వచ్చామన్నారు. ఇంకా ఈ పర్యటనలో మాజీ మంత్రులు సీహెచ్ మల్లారెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, గోపీనాథ్, ఎమ్మెల్సీలు ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్, గోరేటి వెంకన్న, తాతా మధుసూదన్, రాజు, సుభాష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, గండ్ర వెంకటరమణారెడ్డి, చల్మెడ లక్ష్మీనరసింహారావు, ఏనుగు రవీందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మహదేవపూర్ మండల అధ్యక్షుడు లింగపల్లి శ్రీనివాసరావు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

వీడియో తీసి.. ఎక్స్‌లో అప్‌లోడ్ చేసి..

కేటీఆర్ బృందంతో కలిసి మేడిగడ్డ బ్యారేజీ సందర్శనకు వచ్చిన మాజీమంత్రి జగదీశ్వర్‌రెడ్డి కుంగిన 7వ బ్లాక్ వద్ద వరద ఉధృతి, పిల్లర్ల పరిస్థితిని ఓ వీడియో రికార్డు చేశారు. ఆ వీడియోను తన ఎక్స్‌ఖాతాలో అప్‌లోడ్ చేశారు. బ్యారేజీ మొత్తంలో ఒక పిల్లర్ కుంగితే యావత్ కాళేశ్వరం ప్రాజెక్టు కుంగిందని కాంగ్రెస్ నేతలు దుష్ప్రచారం చేస్తున్నారని, మేడిగడ్డ బ్యారేజీ మేడిపండని వ్యాఖ్యానిచడం దారుణమని ప్రభుత్వంపై మండిపడ్డారు. ఇప్పుడంటే ఇప్పుడు నీటిని లిఫ్ట్ చేసే విధంగా కన్నెపల్లి పంప్‌హౌజ్ సిద్ధంగా ఉందని ఇంజనీర్లు చెబుతున్నారని, మేడిగడ్డ బ్యారేజీలో సమస్య ఉంటే అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో సమస్య ఉందని నీటిని నిల్వ చేయకుండా కాళేశ్వరం ప్రాజెక్టుపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు.

అన్నారం, సుందిళ్ల బ్యారేజీల్లో నీటిని నిల్వ చేసేందుకు అవకాశం ఉన్నా కాంగ్రెస్ నాయకులు చేసిన అబద్ధపు ప్రచారాలు ప్రజలకు తెలిసిపోతాయనే దురుద్దేశంతో చేయకుండా లక్షలాది మంది రైతులు ఉసురుపోసుకుంటున్నారని ఆరోపించారు. కాళేశ్వ రం ప్రాజెక్టు ద్వారా రైతులకు నీరందిస్తే కేసీఆర్ కు గుర్తింపు వస్తుందనే దురుద్దేశంతో ప్రాజెక్టు పట్ల నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడ్డారు.



నర్సింహులపేట మండలం బొజ్జన్నపేట భీమ్లాతండాలో వరినాటు వేస్తున్న ఎస్సై సతీష్

వరి నాటు వేస్తూ.. సందడి చేస్తూ..

సైబర్ నేరాలపై నర్సింహులపేట ఎస్సై అవగాహన

నర్సింహులపేట, జూలై 26: వరినాటు వేస్తూ.. కూలీలు, రైతులతో సందడి చేస్తూ సైబర్ నేరాలపై ఎస్సై గండ్రాతి సతీష్ వినూత్నంగా అవగాహన కల్పించారు. నర్సింహులపేట మండలంలోని బొజ్జన్నపేట శివారు భీమ్లా తండకు చెందిన బానోతు లక్‌పతి వ్యవసాయ క్షేత్రంతో ఎస్సై గండ్రాతి సతీష్ శుక్రవారం మహిళా కూలీలతో కలిసి వరినాటు వేస్తూ సందడి చేశారు. అనంతరం ఎస్సై మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేయడం శుభపరిణామమన్నారు. ఇటీవల కాలం నుంచి సైబర్ నేరగాళ్లు రైతులను టార్గెట్ చేసుకొని రైతుల సెల్‌ఫోన్‌లకు లింకులు పంపుతూ వారి ఖాతాలో ఉండబడిన నగదును దోచుకుంటున్నట్లు వివరించారు. అపరిచిత వ్యక్తులు ఎవరైనా ఫోన్ చేసి తమ బ్యాంకు వివరాలు అడిగితే చెప్పవద్దన్నారు. సైబర్ నేరాలపై ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, రైతులు, కూలీలు ఉన్నారు.

గంజాయి పట్టివేత

కాజీపేట, జూలై 26: కాజీపేట రైల్వే స్టేషన్ సమీపంలో పోలీసుల తనిఖీలు చేస్తుండగా ఓ వ్యక్తి గంజాయితో పట్టుబడ్డారు. కాజీపేట ఇన్‌స్పెక్టర్ వై.సుధాకర్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రైల్వేస్టేషన్ సమీపంలో శుక్రవారం ఎస్సై నవీన్ కుమార్ బృందం తనిఖీలు చేస్తుండగా దర్గాకు చెందిన అఫ్జల్ వద్ద 100 గ్రాముల గంజాయి లభ్యమైంది. పట్టుబడిన అఫ్జల్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు. గంజాయి విలువ రూ.3,500 ఉంటుందని పోలీసులు తెలిపారు.

రిజర్వేషన్లు పెంచిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి

వడ్డేపల్లి, జూలై 26: బీసీ రిజర్వేషన్లు పెంచిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ సంక్షేమ సంఘం వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వడ్లకొండ వేణుగోపాల్‌గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం హనుమకొండ ఎన్జీవోస్ కాలనీలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీల రిజర్వేషన్లు స్థానిక సంస్థల్లో 42 శాతానికి పెంచాలని అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు కామారెడ్డిలో జరిగిన బీసీ డిక్లరేషన్ సభలో తమ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వస్తే బీసీ కులగణన చేపట్టి స్థానికసంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని హామీ ఇచ్చిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా అసెంబ్లీలో బీసీ కులగణన కోసం జీవో నంబర్ 26 ఇచ్చి రూ.150కోట్లు బడ్జెట్ కేటాయించి, త్వరలో బీసీ కులగణన చేపట్టి బీసీల జనాభా దామాషా ప్రకారం బీసీ రిజర్వేషన్లు పెంచుతామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారని పేర్కొన్నారు. ఇప్పుడు పాత రిజర్వేషన్ ప్రకారమే ఆగస్టులో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడం ఎంతవరకు సమంజసమని వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ ప్రశ్నించారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు దాడి మల్లయ్యయాదవ్, రవీందర్, తమ్మల శోభారాణి, శ్రీనివాస్‌గౌడ్, నాగరాజు పాల్గొన్నారు.

కొత్త చట్టాలపై పోలీసు కళా బృందం ప్రదర్శన

వరంగల్ క్రైం, జూలై 26: కాకతీయ యూనిర్సిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని యాదవనగర్‌లో కొత్త చట్టాలపై అవగాహన, మత్తు పదార్థాల వల్ల జరిగే అనర్థాల గురించి పోలీసు కళా బృందంతో కార్యక్రమం నిర్వహించారు. పాటలు, నాటిక ద్వారా కళాబృందం సభ్యులు అవగాహన కలిగించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కేయూ సీఐ సంజీవ్ మాట్లాడుతూ.. యువకులు మత్తు పదార్థాల బారినపడి భవిష్యత్ అంధకారం చేసుకోవద్దన్నారు. గంజాయి అమ్మినా, సేవించినా 8712685257 నంబర్‌కు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రవిందర్, కళా బృందం ఇన్‌చార్జి నాగమణి, హెడ్ కానిస్టేబుళ్లు విలియమ్, వెంకటేశ్వర్లు, కానిస్టేబుల్ రత్నయ్య, హోంగార్డులు శ్రీనివాస్, విక్రమ్‌రాజ్, చిరంజీవి పాల్గొన్నారు.



కళాజాతలో మాట్లాడుతున్న సీఐ సంజీవ్

17 నుంచి ఎస్డీఎల్‌సీఈ ఎంఎస్‌డబ్ల్యూ ఫైనల్ ఇయర్ పరీక్షలు

కేయూ క్యాంపస్, జూలై 26: ఆగస్టు 17 నుంచి కాకతీయ యూనివర్సిటీ దూరవిద్య కేంద్రం ఎంఎస్ డబ్ల్యూ ఫైనల్ ఇయర్ పరీక్షలు నిర్వహిస్తామని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి, ఎస్డీఎల్‌సీఈ డైరెక్టర్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎన్.నరేందర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 17, 20, 22, 24, 28, 30 తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని వెల్లడించారు. పరీక్షల కేంద్రాన్ని కేయూ క్యాంపస్‌లోని బీఈడీ కళాశాలలో ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఇతర వివరాలకు కేయూ దూరవిద్య కేంద్రంలో సంప్రదించాలని కోరారు.

8 నుంచి ఎంసీఏ సెమిస్టర్ పరీక్షలు

ఆగస్టు 8 నుంచి కాకతీయ యూనివర్సిటీ రెగ్యులర్ ఎంసీఏ మొదటి ఏడాది రెండో సెమిస్టర్ పరీక్షలు నిర్వహిస్తామని కేయూ అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 8, 13, 17, 20, 22, 24, 27 తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పరీక్షలు జరుగుతాయని వెల్లడించారు.

ఎంబీఏ సెమిస్టర్ పరీక్షలు కూడా..

ఆగస్టు 8 నుంచి కాకతీయ యూనివర్సిటీ రెగ్యులర్ ఎంబీఏ మొదటి ఏడాది రెండో సెమిస్టర్ పరీక్షలు నిర్వహిస్తామని కేయూ అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 8, 13, 17, 20, 22 తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని వెల్లడించారు.

7 వతేదీ నుంచి పీజీ కోర్సుల ఎగ్జామ్స్

కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఎంఏ, ఎంకాం, ఎంఎస్సీ, ఎంఎస్‌డబ్ల్యూ, ఎంటీఎం, ఎంహెచ్‌ఆర్‌ఎం, సైకాలజీతోపాటు ఇతర పీజీ రెగ్యులర్ కోర్సుల పరీక్షలు ఆగస్టు 7 నుంచి నిర్వహిస్తామని అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆగస్టు 7, 9, 12, 14, 16, 19 తేదీల్లో మధ్యాహ్నం 2గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పరీక్షలు జరుగుతాయని తెలిపారు. రెగ్యులర్, ఎక్స్ ఇంప్రూమెంట్ అభ్యర్థులందరూ పరీక్షలకు హాజరు కావాలని సూచించారు. ఇతర వివరాలకు కేయూ వెబ్‌సైట్‌లో చూడాలని కోరారు.

వరంగల్ ఆర్టీసీ అకౌంట్ ఆఫీసర్‌గా రవీందర్

బాలసముద్రం, జూలై 26: వరంగల్ రిజీయన్‌లో అకౌంట్ ఆఫీసర్‌గా ఎల్.రవీందర్‌ను నియమిస్తూ శుక్రవారం ఆర్టీసీ ఎం.డి. సజ్జనార్ ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఇక్కడ అకౌంట్ అఫీసర్‌గా పని చేసిన లావణ్య అవినీతి ఆరోపణలతో సస్పెన్షన్‌కు గురైన విషయం తెలిసిందే. ఆమె స్థానంలో హైదరాబాద్‌లోని బస్‌భవన్‌లో పీఎఫ్ ట్రస్టు ఏవోగా పనిచేస్తున్న రవీందర్‌ను వరంగల్ ఆర్టీసీ అకౌంట్ ఆఫీసర్‌గా నియమిస్తూ సజ్జనార్ ఉత్తర్వులు జారీ చేశారు.





ప్రభాకర్ తన హోటల్‌లో ఏర్పాటు చేసిన సందేశాత్మక కవితలు, ఓటును అమ్ముకోవద్దని ప్రచారం చేస్తున్న ఉత్తమ పౌర సమాజం నాయకులు

సమాజ చైతన్యమే లక్ష్యంగా..

ఓటును అమ్ముకోవద్దని, మద్యం మానాలంటూ విస్తృత ప్రచారం ● పదిహేనేళ్లుగా శివునిపల్లిలో ఓ హోటల్ యజమాని కృషి

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, జూలై 26: ఆయన ఓ చిన్న హోటల్ యజమాని. ఆ హోటల్ నడుపుకొంటూ వచ్చే ఆదాయంతోనే జీవనం సాగిస్తుంటారు. అలాంటి ఓ సాధారణ వ్యక్తి సమాజ చైతన్యమే లక్ష్యంగా పదిహేనేళ్లుగా తన వంతు కృషి చేస్తున్నారు. నిత్యం ఏదో ఒక కార్యక్రమం నిర్వహిస్తూ తన హోటల్‌కు వచ్చే వారిలో చైతన్యం కలిగించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఆయనే.. స్టేషన్‌ఘన్‌పూర్ జంట పట్టణం శివునిపల్లి మేజర్ పంచాయతీ కార్యాలయానికి ఎదురుగా ఉన్న హోటల్ గంగా జమున యజమాని వై.ప్రభాకర్. సందేశ కవితలు ఏర్పాటు చేయడంతో పాటు హోటల్‌కు వచ్చే వారికి తన కవితలు వినిపిస్తూ ఆలోచింపజేస్తున్నారు. ఏటా జాతీయ నాయకుల జయంతులు, వర్ధంతులు నిర్వహిస్తున్నారు. మద్యపానంతో కుటుంబాలను నాశనం చేసుకోవద్దని ప్రచారం చేస్తున్నారు. అంతేకాదు ఉత్తమ పౌర సమాజం పేర సంఘం ఏర్పాటు చేసి ఓటు హక్కు ప్రాధాన్యతను తెలియచేసేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. 15 ఏళ్ల క్రితమే శివునిపల్లిలో ఈ సంఘాన్ని ఏర్పాటు చేసిన ప్రభాకర్ 'ప్రలోభాలకు లొంగకుండా ఓటేద్దాం, సమస్యలపై నిలదీద్దాం' అంటూ ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు. అభ్యర్థులు కూడా నిజాయితీగా ఉండాలని, అహర్నిషలు ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవ చేయాలని కోరుతున్నారు.

మహనీయులను స్మరించుకునేందుకు..

జాతీయ నాయకులు, మహనీయులు, కవులు, రచయితలు అందించిన పోరాట స్ఫూర్తిని నిత్యం స్మరించుకోవాలన్న సంకల్పంతో ఏటా వారి జయంతులు, వర్ధంతులు నిర్వహిస్తున్నారు ప్రభాకర్. మహాత్మా గాంధీ, పొట్టి శ్రీరాములు, చాచా నెహ్రూ, లాల్ బహదూర్ శాస్త్రీ, నేతాజీ, స్వామీ వివేకానంద, బీఆర్ అంబేద్కర్, కాళోజీ, మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం, ప్రొఫెసర్ జయశంకర్, చాకలి ఐలమ్మ తదితరుల కార్యక్రమాలు స్వచ్ఛందంగా నిర్వహిస్తున్నారు. ఇక స్వాతంత్ర్య దినోత్సవం, రిపబ్లిక్ డే వేడుకలను ఎంతో ఉత్సాహంగా చేపడుతున్నారు.

నిషా బినా పీనేకా సంఘ్ సారథిగా...

మద్యపానం వల్ల కలిగే నష్టాలపై ప్రజలను చైతన్యం చేస్తూ.. శివునిపల్లి పట్టణంలో చాలా సభలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహించారు. మద్యం తాగని వారితో నిషా బినా పీనేకా సంఘ్ పేర సంఘం ఏర్పాటు చేశారు. 'మద్యం మానండి, కుటుంబాలను బాగా చూసుకోండి' అంటూ ఇప్పటికీ విస్తృత ప్రచారం చేస్తున్నారు.

కొందరు మారినా చాలు : ప్రభాకర్

శివునిపల్లిలో 20 ఏళ్లుగా చైతన్య కార్యక్రమాలు చేపడుతున్నాం. ఈ ప్రయత్నంలో కొందరు మారినా చాలు. ఎంతో కొంత ప్రయత్నం చేయడం మంచిది కదా. మద్యం తాగని వారితో 'నిషా బినా పీనేకా సంఘ్' ఏర్పాటు చేసి ఎన్నో చైతన్య కార్యక్రమాలు చేపట్టాం. 18 ఏళ్ల నుంచి చిన్న కవితలను రాసి వాటిని ముద్రించి ప్రదర్శిస్తున్నాం. ప్రజలు నిజాయితీగా ఓటువేయాలని కోరుతూ ఉత్తమ పౌర సమాజం పేర సంఘాన్ని ఏర్పాటు చేశాం.

రీఫండ్ కోసం తప్పుడు సమాచారం ఇస్తే చర్యలు

పోలీసు కమిషనరేట్ అడ్మినిస్ట్రేషన్ అదనపు డీసీపీ రవి



సమావేశంలో మాట్లాడుతున్న అదనపు డీసీపీ రవి

వరంగల్ క్రైం, జూలై 26: ఆదాయం పన్ను రీఫండ్ కోసం తప్పుడు వివరాలతో రిటర్న్స్ సమర్పిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిపాలన విభాగం అదనపు డీసీపీ రవి హెచ్చరించారు. ఆదాయం పన్ను రిటర్న్స్‌పై పోలీస్ అధికారులు, సిబ్బందికి శుక్రవారం జూమ్ మీటింగ్ ద్వారా అవగాహన సమావేశం కమిషనరేట్ కార్యాలయంలో నిర్వహించారు. వరంగల్ జిల్లా ఆదాయ పన్ను అధికారి మహేందర్‌బాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అదనపు డీసీపీ రవి మాట్లాడారు. తప్పుడు సమాచారంతో ఆదాయ పన్ను రిటర్న్స్ సమర్పించడం నేరమన్నారు. రీఫండ్ కోసం తప్పుడు సమాచారం ఇచ్చే ప్రయత్నం చేయకూడదన్నారు. ఒకవేళ ఇచ్చినట్లు తేలితే చట్ట ప్రకారం చర్యలు ఉంటాయన్నారు. ఆదాయ పన్ను అధికారి మహేందర్‌బాబు మాట్లాడుతూ.. ప్రభుత్వ వేతన ఉద్యోగులు తప్పుడు సమాచారంతో తమ ఆదాయ పన్ను రిటర్న్స్ సమర్పించి రావాల్సిన దానికన్నా ఎక్కువ రీఫండ్ క్లెయిమ్ చేసుకుంటున్నట్లు వెలుగు చూసిందన్నారు. ఇలాంటి వారిని గుర్తించి నోటీసులు పంపామన్నారు. తప్పుడు సమాచారం ఇస్తే ఆదాయ పన్ను చట్టం కింద చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో అదనపు డీసీపీలు సంజీవ్, సురేష్‌కుమార్, ఏవో రామకృష్ణ, ఏసీపీలు, ఆర్‌ఐలు తదితరులు పాల్గొన్నారు.

సివిల్ సర్వీస్ శిక్షణను వినియోగించుకోవాలి

కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి



గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న రిజిస్ట్రార్ మల్లారెడ్డి

కేయూ క్యాంపస్, జూలై 26: 2024-25 ఏడాదికి గాను యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహిస్తున్న ప్రిలిమినరీ పరీక్షలకు రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి సంస్థ అధ్యయన కేంద్రం హైదరాబాద్ అందిస్తున్న ఉచిత కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలని కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి సూచించారు. శుక్రవారం కేయూ రిజిస్ట్రార్ చాంబర్‌లో సివిల్ సర్వీస్ అప్టిట్యూడ్ టెస్ట్ (సీఎస్ఏటీ) ప్రవేశ పరీక్ష గోడ పత్రికను ఆవిష్కరించి మాట్లాడారు. ప్రిలిమినరీ పరీక్షకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని వివరించారు. గుర్తింపు కలిగిన వర్సిటీ నుంచి డిగ్రీ ఉత్తీర్ణత సాధించి, రూ.3లక్షల వార్షిక ఆదాయం కలిగిన వారందరూ అర్హులేనన్నారు. దరఖాస్తులు జూలై 31 వరకు చేసుకోవాలని, అలాగే దరఖాస్తులు చేసుకున్న అభ్యర్థులకు ఆగస్టు 8న పరీక్షలు నిర్వహించి ప్రతిభ ఆధారంగా ఉచిత శిక్షణకు ఎంపిక చేస్తారని వెల్లడించారు. ఎంపికైన అభ్యర్థులు హైదరాబాద్‌లో శిక్షణ తీసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు వెబ్‌సైట్ http://tsstudycircle. co.in/లో సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కేయూ హాస్టల్స్ డైరెక్టర్ డాక్టర్ ఎల్‌పీ రాజ్‌కుమార్, కేయూ అసిస్టెంట్ రిజిస్ట్రార్ సీహెచ్. ప్రణయ్‌కుమార్, ఎస్సీ అధ్యయన సంస్థ వరంగల్ గౌరవ డైరెక్టర్ డాక్టర్ కె.జగన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగంగా ఎక్స్ రే మిషన్



వరంగల్ మెడికల్, జూలై 26: అప్పుడే పుట్టిన నవజాత శిశువులకు ఉపయోగించే ఎక్స్‌రే మిషన్ నిరూపయోగంగా మారింది. ప్రభుత్వం లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన ఉపయోగించే నాథేడు కరువయ్యాడు. ఎంజీఎంలోని ఎస్ఎన్‌సీయూ వార్డులో అప్పుడు పుట్టిన పిల్లల్లో అవలక్షణాలు గుర్తించేందుకు మొబైల్ ఎక్స్‌రే మిషన్‌ను ప్రభుత్వం పంపించింది. ఇందుకోసం ఓ ఆపరేటర్‌ను నియమించినప్పటికీ రెండు గంటలు మాత్రమే విధుల్లో ఉంటున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. రాత్రి 8 గంటల నుంచి ఉదయం 8 గంటల వరకు ఇందులో ఉన్న డాక్టర్లు ఈ నిర్ధారణ పరీక్ష కోసం టెక్నీషియన్ కోసం నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొందని రోగుల బంధువులు ఆరోపిస్తున్నారు. ఎక్స్‌రే మిషన్‌తోపాటు వైద్యులు ఉన్నప్పటికీ టెక్నీషియన్ లేకపోవడంతో పిల్లలకు వైద్యం అందం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు అత్యవసర విభాగంలో 24 గంటలపాటు అందుబాటులో ఉండే విధంగా టెక్నీషియన్‌లను నియమించాలని రోగుల బంధువులు డిమాండ్ చేస్తున్నారు.

ఎంజీఎంలో కుక్కల స్వైర విహారం



ఎంజీఎంలో తిరుగుతున్న కుక్క

వరంగల్ మెడికల్, జూలై 26: ఎంజీఎం ఆస్పత్రిలోని పలు వార్డుల్లో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. ప్రధానంగా పిల్లల వార్డులో కూడా రాత్రివేళల్లో దర్శనమిస్తున్నాయి. చిన్నపిల్లలను తల్లిదండ్రులు కంటికి రెప్పలా కాపాడుకుంటున్నప్పటికీ కుక్కల వల్ల ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని రాత్రి వేళల్లో పిల్లలకు కాపలాగా ఉంటున్నారు. అటెండెన్స్ మధ్య కుక్కలు కూడా సహవాసం చేస్తున్నాయని భయభ్రాంతులకు గురవుతున్నారు. గతంలో ఎలుకలు కొరికిన విధంగా పిల్లలపై దాడికి కుక్కలు దిగకముందే తగిన చర్యలు తీసుకోవాలని రోగుల బంధువులు విజ్ఞప్తి చేస్తున్నారు.

జీర్ణించుకోలేని విషాదం

- 'కొండాయి' గుండెకోతకు ఏడాది
- గతేడాది జూలై 27న జంపన్నవాగు వరదకు 8 మంది బలి
- గ్రామాన్ని ముంచెత్తిన జలప్రళయం
- మరువలేకపోతున్న పల్లె జనం



నాటి వరదలకు మునిగిపోయిన కొండాయి గ్రామం

ఏటూరునాగారం రూరల్, జూలై 26: పచ్చని అడవి పల్లెను వరద మింగేసింది. వాగు ఉప్పొంగి ఊరు ఊరంతటినీ నీటముంచింది. ఏకంగా ఎనిమిది మందిని బలిగొంది. అనేక మంది ఆస్తులను నష్టపర్చింది. సరిగ్గా ఏడాది క్రితం ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం కొండాయిలో జరిగిన ఈ దుర్ఘటన తీవ్ర గుండెకోతను మిగిల్చింది. గత ఏడాది భారీ వర్షాలకు మహోగ్రరూపం దాల్చిన జంపన్నవాగు జలప్రళయాన్ని సృష్టించింది. ఇది జరిగి ఏడాది పూర్తయినా ఆ విషాదం ఛాయలు ఆ గ్రామాన్ని వెంటాడుతూనే ఉన్నాయి. కళ్లెదుటే తిరిగిన వ్యక్తులు చూస్తూ చూస్తుండగానే వరదలో కొట్టుకుపోయి ప్రాణాలు కోల్పోవడాన్ని ఆ పల్లె ప్రజలు జీర్ణించుకోలేకపోతున్నారు.

ప్రశాంత పల్లెలో పెను విషాదం

ప్రశాంతంగా ఉన్న కొండాయి గ్రామంలో పెను విషాదం చోటు చేసుకుంది. గత ఏడాది జూలై 27న ఒక్కసారిగా ప్రళయం వచ్చినట్టయ్యింది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు జంపన్నవాగు ఉగ్రరూపం దాల్చింది. ఎప్పటిలాగే వాగు ఉప్పొంగిందని అనుకున్నారు ఆ పల్లె వాసులు. ఉదయం 9 గంటల వరకు మామూలుగానే ప్రవహించిన జంపన్నవాగు మధ్యాహ్నానికి మహోగ్రరూపం దాల్చింది. గంటల వ్యవధిలోనే వరద ఇళ్లను ముంచెత్తింది. సాయంత్రం 3గంటలకు చరిత్రలో ఎన్నాడూ లేని విధంగా కొండాయి గ్రామం అంతటినీ జంపన్నవాగు చుట్ట ముట్టింది.

ఎనిమిది మంది బలి


జంపన్నవాగు వరదంతా ఇళ్లల్లోకి భారీగా చేరుకోవడంతో ప్రజలు ప్రాణాలు కాపాడుకునేందుకు సురక్షిత ప్రాంతాలకు వెళ్లేందుకు విశ్వ ప్రయత్నాలు చేశారు. వరదను దాటి వెళ్తున్న క్రమంలో ఎనిమిది మంది కొట్టుకుపోయి మృతి చెందారు. వీరిలో దబ్బకట్ల సమ్మక్క, ఎండీ అజ్జు, ఎండీ షరీఫ్, ఎండీ మహబూబ్‌ఖాన్, ఎండీ మజీద్ ఖాన్, ఆయన భార్య లాల్‌బీ, రషీద్, ఆయన భార్య కరీమాబీ వరదలో కొట్టుకపోయి ప్రాణాలు కోల్పోయారు. క్షణాల వ్యవధిలోనే ఎనిమిది మందిని జంపన్నవాగు బలిగొంది. అలాగే మూగ జీవాలు వాగులో కొట్టుకుపోయాయి. ఇళ్లు నేలమట్టం కావడమే కాక సామగ్రి అంతా నీళ్లపాలైంది. గ్రామస్థులు నిలువ నీడలేక నిరాశ్రయులయ్యారు. ఈ జలప్రళయం ఘటన రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర విషాదాన్ని మిగిల్చింది.


కల్వర్టే ప్రాణాలను మిగింది..

మల్యాల, కొండాయి గ్రామాల మధ్య కొత్తగా రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఇందులో భాగంగా ఆయా గ్రామాల మధ్య ఆశ్రమ పాఠశాలకు కొద్ది దూరంలో కల్వర్టుల నిర్మాణం చేపట్టారు. ఈ క్రమంలో రోడ్డును తవ్వి నీళ్ల వెళ్లేందుకు సిమెంట్ పైపులను ఏర్పాటు చేశారు. వాటిపై మట్టి పోసి వదిలేశారు. దీంతో జంపన్నవాగు వరద గ్రామాన్ని చుట్టు ముట్టిన క్రమంలో కల్వర్టులు నీట మునిగి దానిపై పోసిన మట్టి కొట్టుకుపోయింది. వాగు గ్రామాన్ని చుట్టుముట్టడంతో ప్రాణాలను కాపాడుకునేందుకు ప్రజలు ఆరహదారి వెంట బయల్దేరారు. అందులో కొంతమంది ఆ కల్వర్టు దాటి వెళ్తుండగా దానిపై మట్టి కొట్టుకుపోవడంతో లోతులోకి దిగి వరదలో గల్లంతై ప్రాణాలు కోల్పోయారు.

'సురక్షితం' లేని హామీ

జంపన్నవాగు మహోగ్రరూపానికి ప్రాణ, ఆస్తి నష్టాన్ని చవిచూసిన కొండాయిపై అప్పట్లో పాలకుల హామీల వర్షం కురిసింది. మృతుల కుటుంబాలకు రూ. 5 లక్షల ఎక్స్‌గ్రేషియాను అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ అందజేశారు. అంతేకాకుండా పూర్తిగా నష్టపోయిన కుటుంబాలకు రూ.10వేల ఆర్థిక సహాయం అందించారు. ఇదే క్రమంలో కొండాయి వాసులను సురక్షిత ప్రాంతానికి తరలించేందుకు అప్పటి ప్రభుత్వం ప్రణాళికలను సిద్ధం చేసింది. అనంతరం అది కార్యరూపం దాల్చలేదు. కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఆ దిశగా అడుగులు వేయలేకపోయింది.





కొండాయి వరదల్లో ప్రాణాలు కోల్పోయిన కొండాయి వాసులు (ఫైల్)

ముగిసిన రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ టోర్నీ



విజేతలుగా నిలిచిన క్రీడాకారులతో సీపీ అంబర్‌కిషోర్ ఝా, నిర్వాహకులు

వరంగల్ స్పోర్ట్స్, జూలై 26: వరంగల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హనుమకొండ సుబేదారిలోని ఆఫీసర్స్ క్లబ్‌లో మూడు రోజులుగా నిర్వహిస్తున్న 10వ తెలంగాణ రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్స్ అండర్-17బాలబాలికల బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ టోర్నీ ముగిసింది. శుక్రవారం క్లబ్‌లో ఏర్పాటు చేసిన క్రీడా పోటీల ముగింపు వేడుకలకు వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ముఖ్య అతిథిగా హాజరై ఫైనల్స్‌లో తలపడిన పలు జట్ల క్రీడాకారుల ఆట తీరును తీసి హర్షం వ్యక్తం చేశారు.

మిక్స్‌డ్ డబుల్స్ ఫైనల్స్‌లో శౌర్యకిరణ్ (వరంగల్), కీర్తి మంచాల (జనగామ) బీట్ శ్రీఆదిత్య బొమ్మకంటి (రంగారెడ్డి) రిషితాపాండే (రంగారెడ్డి) జోడి మధ్య ఉత్కంఠభరితంగా జరిగిన హోరాహోరీపోరులో శ్రీఆదిత్య, రిషితపాండే జోడి విజయం సాధించారు. దీంతో శౌర్యకిరణ్, కీర్తి మంచాల ద్వితీయస్థానంతో సరిపెట్టుకున్నారు. అదే విధంగా బాలుర సింగిల్స్‌లో శశాంక్ వనమాల (రంగారెడ్డి) ప్రథమ స్థానం, సాయి నక్షేత్ భటరాజ్ మెదక్ ద్వితీయ స్థానంలో నిలిచారు. బాలికల సింగిల్స్‌లో కీర్తి మంచాల(జనగామ) ప్రథమ, అల్లూరి అక్షయ చౌదరి మెదక్ ద్వితీయ స్థానంలో నిలిచారు. అదేవిధంగా బాలుర డబుల్స్‌లో సాయి సిద్ధార్థ్ రాయప్రోలు, యువసూర్య జాగర్లముడి (హైదరాబాద్) ధృవ్ పరిశేద్ సితి, వివేక్ బొల్లం రంగారెడ్డి జోడి అనివార్య కారణాల వల్ల పోటీలో పాల్గొనకపోవడంతో సాయి సిద్ధార్థ్, యువసూర్యల జోడి విజయం సాధించారు. బాలికలడబుల్స్‌లో లక్ష్మీరిధిమా దేవినేని, సరయు సూర్యనేని (హైదరాబాద్)అనుసంజన మురళి, గాదే స్తుతి గ్రేసిరెడ్డి (రంగారెడ్డి) జోడిపై లక్ష్మీరిధిమా దేవినేని, సరయు సూర్యనేని విజయం సాధించారు.

విజేతలకు వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్‌కిషోర్ ఝా ట్రోఫీలను, బహుమతులను ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. క్రీడల్లో గెలుపోటములు సమానంగా తీసుకొని పట్టుదలతో సాధన చేస్తే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవచ్చునన్నారు. విద్యార్థులకు విద్య ఎంత అవసరమో క్రీడలకు అంతే ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. క్రీడల్లో పాల్గొనే సమయంలో కష్టంగా భావించకుండా సంతోషంగా సాధన చేస్తే అనుకున్న గమ్యాన్ని అందిపుచ్చుకోవచ్చునన్నారు. రాష్ట్రస్థాయి పోటీలను నిర్వహించిన అసోసియేషన్ బాధ్యులను సీపీ అభినందించారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ పింగిలి రమేష్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇక్కడ రాష్ట్రస్థాయిలో నిర్వహించిన టోర్నీలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను త్వరలో కేరళ రాష్ట్రంలో నిర్వహించనున్న జాతీయస్థాయి చాంపియషన్‌షిప్ పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ రమేష్‌కుమార్, వరంగల్ ఆఫీసర్స్ క్లబ్ కార్యదర్శి ఎం.రవీందర్‌రెడ్డి, అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఎం.జితేందర్‌రెడ్డి, మోహన్‌రావు, కోశాధికారి డి.నాగకిషన్, కోచ్ కొమ్ము రాజేందర్, టెక్నికల్ అఫీషియల్స్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌కౌంటర్ మృతుడు అశోక్ అంత్యక్రియలు పూర్తి

అశ్రునయనాలతో వీడ్కోలు పలికిన మహ్మద్‌గౌస్‌పల్లి వాసులు



ములుగు, జూలై 26: తాడ్వాయి-గుండాల సరిహద్దు దామెరతోగు అటవీ ప్రాంతంలో గురువారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరణించిన మావోయిస్టు దళసభ్యుడు నల్లమారి అశోక్ అంత్యక్రియలు శుక్రవారం పూర్తయ్యాయి. ములుగు మండలం మహ్మద్‌గౌస్‌పల్లిలోని వైకుంఠధామంలో కుటుంబసభ్యులు దహన సంస్కారాలు జరిపించారు. అశోక్ మృతదేహాన్ని గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత పోలీసులు ములుగు ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించి మార్చురీలో భద్రపరిచి.. కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా శుక్రవారం ఉదయం మార్చురీ వద్దకు సోదరుడు కుమారస్వామి, అక్క భద్రక్క చేరుకొని అశోక్ మృదేహాన్ని గుర్తించారు. పస్రా సీఐ రవీందర్, ఎస్సై కమలాకర్ నేతృత్వంలో వైద్యులు పోస్టుమార్టం జరిపించి మృతదేహాన్ని వారికి అప్పగించారు. స్వగ్రామం జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలం బుద్దారం అయినప్పటికీ అశోక్ సోదరుడు కొన్నేళ్లుగా ములుగు జిల్లా ములుగు మండలం మహ్మద్‌గౌస్‌పల్లిలో నివాసం ఉంటున్నాడు. ఈక్రమంలో మహ్మద్‌గౌస్‌పల్లికి మృతదేహాన్ని తరలించిన కుటుంబ సభ్యులు అంత్యక్రియలు జరిపించారు. అజ్ఞాతంలోకి వెళ్లిన తర్వాత ఇంటివైపు కన్నెత్తి చూడని అశోక్ తన తండ్రి సంవత్సరీకం రోజునే ఎన్‌కౌంటర్‌లో మరణించడంతో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఇంటికి తీసుకు వెళ్లకుండా నేరుగా శ్మశాన వాటికకు మృతదేహాన్ని తరలించారు. అశోక్ చితికి ఆయన సోదరుడు కుమారస్వామి నిప్పంటించారు. అమరుల బంధుమిత్రుల సంఘం సభ్యులు జోహార్లు అర్పించారు.



ములుగు ఏరియా ఆస్పత్రి వద్ద పోలీసులు



అశోక్ కుటుంబ సభ్యులు, బంధువులు

గాంధీ ఫెల్లోషిప్‌కు రామేశ్వరం

కేయూ క్యాంపస్, జూలై 26: 2024 ఏడాదికి గాను భారత ప్రభుత్వ ఆయుష్ మంత్రిత్వశాఖ నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ న్యాచురోపతి పూణే శాఖ నేతృత్వంలోని గాంధీ ఫెల్లోషిప్ ప్రోగ్రాంకు కేయూ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం రిటైర్డు ప్రొఫెసర్ జి.రామేశ్వరం ఎంపికయ్యారు. ఈ మేరకు నిర్వాహకుల నుంచి తమకు సమాచారం అందినట్లు రామేశ్వరం తెలిపారు. గాంధీ ఫిలాసఫీలో భాగమైన ప్రకృతి వైద్యం (నేచర్ క్యూర్)పై హైదరాబాద్‌లో గల డాక్టర్ బి.వెంకట్‌రావు గాంధీనేచర్ క్యూర్ కాలేజీపై 6 నెలల కాలంలో ప్రొఫెసర్ రామేశ్వరం సమగ్రమైన పరిశోధనలు, పుస్తకాల సేకరణ, రిపోర్టులను రూపొందించాల్సి ఉంటుందని నిర్వహకులు సూచించారు. కాగా ప్రొఫెసర్ రామేశ్వరం తన సొంత ఖర్చులతో హనుమకొండ హంటర్‌రోడ్డులోని ఇంటర్నేషనల్ న్యాచురోపతి లైబ్రరీ, రిసెర్చ్ సెంటర్‌ను నిర్వహిస్తున్నారు. రామేశ్వరంను రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి, పెద్దమల్ల శ్రీనివాసరావు తదితరులు అభినందించారు.

ఎంజీఎం మూడో గేటు ఓపెన్

వరంగల్ మెడికల్, జూలై 26: వరంగల్ ఎంజీఎం ఆస్పత్రి మూడోగేట్ కొన్నేళ్ల తర్వాత శుక్రవారం తెరుచుకుంది. ఉత్తర తెలంగాణకు పెద్ద దిక్కు అయిన ఎంజీఎం ఆస్పత్రికి మూడు ప్రధాన గేట్లు ఉన్నాయి. ఒకటో గేటు క్యాజువాలిటీ,ఏ మర్జెన్సీ పిల్లల వార్డుకు వెళ్లేందుకు వీలుగా ఉంటుంది. ఇక రెండో గేటు మీదుగా ఉదయం ఓపీ, పరిపాలన భవనం, ప్రధాన వార్డుల్లోకి సులువుగా వెళ్లేందుకు ఏర్పాటు చేశారు. మునిసిపల్ కార్పొరేషన్ రోడ్డు వైపు ఉన్న మూడో గేటును కొన్నేళ్లుగా తాళం వేసి పెట్టారు. వాహనాల రాకపోకలను నిషేధించారు. ఆ వైపు వెళ్లాలనుకునే రోగులకు గేటు మూసి ఉండటంతో అసౌకర్యంగా ఉండేదని రోగులు అనేకసార్లు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఎట్టకేలకు శుక్రవారం నుంచి మూడో గేటు ద్వారా వాహనాల రాకపోకలకు ఎంజీఎం అధికారులు అనుమతించారు.

అర్హులకే డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇస్తాం

స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

జనగామ రూరల్, జూలై 26: అర్హులకే డబుల్ బెడ్ రూం ఇండ్లు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో డబుల్‌బెడ్ రూం ఇండ్ల నిర్మాణాలపై కలెక్టర్ రిజ్వాన్ బాషా అధ్యక్షతన రెవెన్యూ, ఇంజనీరింగ్, గృహనిర్మాణ శాఖ అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలోని 5 మండలాలకు మంజూరైన 1145 ఇండ్లలో 615 ఇండ్లు టెండరు దశలో ఉన్నాయని, పూర్తయిన ఇండ్లకు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను త్వరితగతిన చేపట్టాలని అన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు పింకేష్‌కుమార్, రోహిత్‌సింగ్, ఆర్‌డీవోలు కొమురయ్య, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణపై సమీక్ష..

కలెక్టరేట్‌లో శుక్రవారం నియోజకవర్గస్థాయి అంగన్‌వాడి కేంద్రాల నిర్వహణపై కలెక్టర్ రిజ్వాన్ బాషా అధ్యక్షతన ఎమ్మెల్యే కడియం సమీక్ష నిర్వహించారు. ఐసీడీఎస్ అధికారులు, సిబ్బంది నిబద్ధతతో పని చేయాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ ప్రాంతాల్లో పర్యటిస్తూ పిల్లలకు నాణ్యమైన పౌష్టికాహారం అందేలా చూడాలని, పోషణ్ అభియాన్, బేటీ బచావో, బేటీ పడావోపై గ్రామాలలో అవగాహన కల్పించాలని అన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ నియోజకవర్గంలో గర్భిణులు, బాలికలు 2212 మంది, 7 నెలల నుంచి 3 సంవత్సరాల పిల్లలు 17,673 మంది, 3 - 6 సంవత్సరాల పిల్లలు 14,040 మంది ఉన్నారన్నారు. అంగన్‌వాడి కేంద్రాలలో త్వరలో మరుగుదొడ్లు నిర్మిస్తామన్నారు. సఖి కేంద్రం ద్వారా 960 కేసులలో 887 కేసులు పరిష్కరించామని, మిగతావి త్వరలో పరిష్కరిస్తామని అన్నారు. బాల్య వివాహాల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు పింకేష్‌కుమార్, రోహిత్‌సింగ్, డీడబ్ల్యూవో జయంతి, ఆర్‌డీవో కొమురయ్య, అధికారులు పాల్గొన్నారు.

దసరా రోజున కార్యాలయాలకు శంకుస్థాపన చేస్తాం..

స్టేషన్‌ఘన్‌పూర్: వచ్చే దసరా రోజున స్టేషన్‌ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలో రెవెన్యూ డివిజనల్ కార్యాలయాల సముదాయం నిర్మాణానికి శంకుస్థాపన చేస్తామని ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. ఇందుకోసం శుక్రవారం డివిజన్‌కేంద్రంలో ఉన్న ప్రభుత్వ స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఘన్‌పూర్ రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేసి ఆరేళ్లు కావస్తున్న కార్యాలయాల ఏర్పాటు జరుగలేదన్నారు. 50వేల స్క్వేర్ ఫీట్స్ విస్తీర్ణంలో కాంప్లెక్స్‌ను ఏర్పాటు చేసి 20 కార్యాలయాలు అదే కాంప్లెక్స్ నుంచి సేవలు అందించేలా జీప్లస్ భవనం నిర్మించేలా ప్రతిపాదనలు రూపొందిస్తున్నామన్నారు. తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలు శిథిలావస్థలకు చేరుకున్నాయని, వాటిని తొలగించి అదే స్థలంలో సముదాయం నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్, ఆర్డీవో వెంకన్న, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, డీఈ రాజగోపాల్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను నియమించాలంటూ వినతి..

జఫర్‌గడ్: తమ్మడపల్లి(జి) జడ్పీ హైస్కూల్‌లో హెచ్‌ఎంతో పాటు విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను నియమించేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు ఎమ్మెల్యే కడియం శ్రీహరిని కోరారు. ఈ మేరకు శుక్రవారం వారు ఎమ్మెల్యేను స్టేషన్‌ఘన్‌పూర్‌లో కలుసుకుని వినతి పత్రం అందించారు. ఇటీవల హెచ్‌ఎం బదిలీ అయ్యారని, ఆయన స్థానంలో ఎవరూ జాయిన్ కాకపోవడంతో సీనియర్ ఉపాధ్యాయుడే ఇన్‌చార్జి హెచ్‌ఎంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. అలాగే పీఈటీ పోస్టు ఖాళీగా ఉందని, హైస్కూల్‌లో ప్రస్తుతం ఏడుగురు ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నారని ఎమ్మెల్యేకు వివరించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో గుండెబోయిన సతీష్, చిలువేరు నగేశ్, కొంతం యాదగిరి, పులిగిల్ల నాగరాజు, గాదె ఉపేందర్, నాయిని రామస్వామి, శాగ రాజు, వేల్పుల రాములు, ఎండి.మహిమూద్, తదితరులు ఉన్నారు.

ఎల్‌వోసీ అందజేత..

జఫర్‌గడ్ మండలం ముగ్దుంతండాకు చెందిన బానోత్ గన్యా కుటుంబానికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి శుక్రవారం రూ.50 వేల ఎల్‌వోసీ పత్రాన్ని అందించారు. ఆయన తీవ్ర అనారోగ్యంతో బాధపడుతుండగా సీఎం సహాయ నిధి నుంచి మంజూరు చేయించిన పత్రాన్ని హన్మకొండలోని తన నివాసంలో అందజేశారు.



పాలకుర్తిలో మోదీ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు



నర్మెట చౌరస్తాలో..



బచ్చన్నపేటలో..

తెలంగాణకు కేంద్రం అన్యాయం చేసింది

కాంగ్రెస్ శ్రేణుల ఆగ్రహం - మోదీ దిష్టిబొమ్మల దహనం

బచ్చన్నపేట, జూలై 26: బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు అన్యాయం చేసిందని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. ఇందుకు నిరసనగా బచ్చన్నపేటలో శుక్రవారం ప్రధాని నరేంద్ర మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు నూకల బాల్‌రెడ్డి, కిసాన్‌సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ నిడిగొండ శ్రీనివాస్ మాట్లాడుతూ కేవలం కుర్చీ కాపాడుకునేందుకు బీజేపీ స్వార్థపూరితంగా బడ్జెట్ ప్రవేశపెట్టిందన్నారు. తెలంగాణాకు నిధులు కేటాయించకుండా విభజన హామీలు విస్మరించిందన్నారు. ఈ విషయంలో బీజేపీ ఎంపీలు రాజీనామా చేసి చిత్తశుద్ధి చాటుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నల్లనాగుల వెంకటాచారి, నల్లగోని బాలకిషన్‌గౌడ్, కోడూరు మహాత్మాచారి, మాసపేట రవీందర్‌రెడ్డి, అల్వాల ఎల్లయ్య, నారాయణ రెడ్డి, డిడిగ రమేశ్, శ్రీనివాస్, గంగం బుచ్చిరెడ్డి, పుట్ట నర్సింహులు, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

పాలకుర్తి: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం జనగామ జిల్లాకు బడ్జెట్‌లో నిధులు కేటాయించకుండా మొండిచేయి చూపిందని ఆరోపిస్తూ శుక్రవారం రాజీవ్ చౌరస్తాలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ దిష్టిబొమ్మను కాంగ్రెస్ పార్టీ నాయకులు దహనం చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ బ్లాక్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం తెలంగాణపై వివక్ష చూపిస్తోందని మండిపడ్డారు. కార్యక్రమంలో నాయకులు ఎర్రబెల్లి రాఘవరావు, గంగు కృష్ణమూర్తి, పెనుగొండ రమేష్, బిర్రు సోమేశ్వర్, పులి గణేష్, ఐలేష్ యాదవ్, జలగం కుమార్, గాదెపాక భాస్కర్, కమ్మగాని రమేష్, ఆంజనేయులు, బండిపెల్లి వెంకన్న, మహేందర్ ఉన్నారు.

నర్మెట: బడ్జెట్‌లో తెలంగాణ రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం అన్యాయం చేసిందని ఆరోపిస్తూ కాంగ్రెస్ నాయకులు శుక్రవారం మండలకేంద్రంలోని చౌరస్తాలో మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు రాజబోయిన లక్ష్మీనారాయణ మాట్లాడుతూ తెలంగాణ అనే పదం పలకడానికి కేంద్రం ఇష్టపడడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నర్మెట గ్రామ అధ్యక్షుడు ప్రజ్ఞాపురం శ్రీధర్, పీఏసీఎస్ డైరక్టర్ కూకట్ల చంద్రమౌళి, బండి అశోక్, కాశెట్టి బాల నర్సింహులు, కొన్నె తిరుపతి, కన్నెబోయిన రామకృష్ణ, కొన్నె అంజయ్య, బత్తుల కరుణాకర్, మూల చందర్, పరమేశ్వర్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు ఈజీఎస్ డైరెక్టర్ రాజీనామా

కొడకండ్ల జూలై 26 : మండలకేంద్రానికి చెందిన ఈజీఎస్ డైరెక్టర్, మాజీ ఎంపీటీసీ అందె యాకయ్య బీఆర్‌ఎస్ పార్టీకి శుక్రవారం రాజీనామా చేశారు. గత 18 సంవత్సరాలుగా మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అనుచరునిగా, 10 సంవత్సరాలుగా బీఆర్‌ఎస్ పార్టీ ద్వారా ప్రజాసేవ చేశానని అన్నారు. కాంగ్రెస్ పార్టీ విధానాలు నచ్చి ఆ పార్టీలో చేరనున్నట్లు తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

కొడకండ్ల జూలై 26 : మండలకేంద్రం శివారు రంగాపురం క్రాస్‌రోడ్డు వద్ద గురువారం రాత్రి ఆర్టీసీ బస్సు స్కూటీ ఢీకొన్న ఘటనలో గాయపడిన యువకుడు సాయికిరణ్(20) చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందాడు. పాలకుర్తి సీఐ మహేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం సాయంత్రం రంగాపురం వైపు వెళ్తున్న తొర్రూరు డిపో ఆర్టీసీ బస్సు డ్రైవర్ సోమసాని సోమయ్య ఇండికేటర్ వేయకుండా మలుపు తిరిగేసరికి ఏడునూతుల నుంచి కొడకండ్ల వైపు వస్తున్న బైక్ ఢీకొంది. దాంతో స్కూటీ నడుపుతున్న సూర్యాపేట జిల్లా అర్వపెల్లి మండలం జాజిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన జయంత్, వెనుక కూర్చున్న సాయికిరణ్‌కు తీవ్రగాయాలయ్యాయి. వారిని 108లో జనగాం ఏరియా ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ కిరణ్ మృతిచెందాడు. జయంత్ చికిత్స పొందుతున్నాడని సీఐ తెలిపారు.

'ప్రయోగాలు చేస్తే ప్రోత్సహిస్తాం'

పాలకుర్తి, జూలై 26 : ఏ రంగంలోనైనా కొత్తగా ప్రయోగాలు, పరిశోధనలు చేస్తున్న వారికి తగిన గుర్తింపునిచ్చి ప్రోత్సహిస్తామని నేషనల్ ఇన్‌ఫర్‌మేటిక్ సెంటర్ జిల్లా కోఆర్డినేటర్ కళ్యాణి తెలిపారు. శుక్రవారం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులకు ఇంటింటా ఇన్నోవేషన్ కార్యక్రమంపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులైనా, పెద్దలైనా ఏ రంగంలోనైనా ప్రావీణ్యం కలిగి ఉంటే వారిని గుర్తించి ప్రోత్సహిస్తామన్నారు. వారు ఎంపీడీవో కార్యాలయంలో వివరాలు అందచేయాలని కోరారు. సమావేశంలో ఎంపీడీవో రాములు, ఎంపీవో రవికుమార్, పంచాయతీ కార్యదర్శులు లింగయ్య,శిరీష, చంద్రశేఖర్ ఉన్నారు.

రాజ్యాంగంపై అవగాహన యాత్ర

లింగాల ఘనపురం, జూలై 26: భారత రాజ్యాంగంపై హై కోర్టు లోక్ అదాలత్ జడ్జి కందుల రాంనర్సయ్య ఆధ్వర్యంలో అవగాహన యాత్ర నిర్వహించారు. శుక్రవారం మండలంలోని జీడికల్ జడ్పీ హైస్కూల్‌లో ప్రత్యేకంగా చేబట్టిన అవగాహన యాత్రలో భాగంగా భారత రాజ్యాంగ వ్యవస్థ, విద్య, వ్యవసాయం, ఉపాధి, అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను 30 ఏళ్లుగా న్యాయాన్ని ప్రజల వద్దకు తీసుకెళ్తున్నానని, ప్రతీ ఒక్కరికి న్యాయవ్యవస్థ అందుబాటులో ఉండేందుకు ఏకంగా కోర్టునే ప్రజల వద్దకు తీసుకెళ్లామని అన్నారు. కార్యక్రమంలో ఎంఎన్‌వో విష్ణుమూర్తి, కాంప్లెక్స్ హెచ్‌ఎం మల్లిఖార్జున్, హెచ్‌ఎం విజయలక్ష్మి, సత్యం పాల్గొన్నారు.

అంగన్‌వాడీల బలోపేతానికి కృషి



సింగరాజుపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ పింకేష్‌కుమార్

దేవరుప్పుల, జూలై 27: అంగన్‌వాడీల బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదని జనగామ అడిషనల్ కలెక్టర్ పింకేష్‌కుమార్ అన్నారు. శుక్రవారం సాయంత్రం మండలంలోని సింగరాజుపల్లిలోని మాడల్ అంగన్‌వాడి కేంద్రాన్ని ఆయన సందర్శించి పరిశీలించారు. ఈసందర్భంగా మౌలిక వసతులు, గదులు, ఆట వస్తువులు, పిల్లలు నేర్చుకునేందుకు వీలుగా గోడలపై వేసిన పేయింటింగ్‌ను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రైమరీ విద్యను అంగన్‌వాడి కేంద్రాలలో అందించేందుకు ప్రయత్నిస్తున్న తరుణంలో జిల్లాలోని వాటిని మాడల్ కేంద్రాలుగా తీర్చి దిద్దేందుకోసం పరిశీలనకు వచ్చినట్టు వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో రూ.2లక్షల వ్యయంతో మాడల్ అంగన్‌వాడి కేంద్రంగా సింగరాజుపల్లి కేంద్రాన్ని ఏర్పాటు చేయగా చాలా బాగుందని కితాబు ఇచ్చారు. కార్యక్రమంలో పీఆర్‌డీఈ రామలింగాచారి, ఎంపీడీవో లక్ష్మీనారాయణ, ఎంపీవో సురేష్‌కుమార్, మాజీ ఎంపీటీసీ కత్తుల విజయ్‌కుమార్‌రెడ్డి, మాజీ సర్పంచ్ గోపాల్‌దాస్ మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్ బియ్యం స్వాధీనం

నర్మెట, జూలై 26 : అక్రమంగా తరలిస్తున్న పీడీఎస్ బియ్యాన్ని శుక్రవారం నర్మెట పోలీసులు పట్టుకున్నారు. సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలం వట్టిపల్లి గ్రామానికి చెందిన గుగులోతు గోపి నర్మెటలో 28 క్వింటాళ్ల బియ్యం కొనుగోలు చేసి తరలిస్తుండగా పట్టుకొని బియ్యాన్ని, వాహనాన్ని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి హరీష్ రాజ్



రఘునాథపల్లిలో డ్రైడే కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న హరీష్ రాజ్

రఘునాథపల్లి, జూలై 26: సీజనల్ వ్యాధుల పట్ల వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి హరీష్ రాజ్ అన్నారు. మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన శుక్రవారం సందర్శించి పీహెచ్‌సీ ఆవరణలో పరిశుభ్రం చేసే కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతీ శుక్రవారం డ్రై- డే పాటించేలా ప్రజలకు కల్పించాలని అన్నారు. డెంగీ, మలేరియా, చికున్ గున్యా వ్యాధులు వ్యాప్తి చెందకుండా చూడాలని, ఇళ్ల పరిసరాల్లో నీటి నిలువలు లేకుండా చూడాలని, ఈ విషయంలో ప్రజలను చైతన్య పర్చాలని అన్నారు. జ్వర బాధితులు ఉన్నట్లయితే తక్షణమే చికిత్స అందించాలని, న్యూమోనియా, వాంతులు, విరేచనాల పట్ల ప్రజలకు అవగాహన కల్పిస్తూ, పీహెచ్‌సీలు, ఆశ వర్కర్లు, ఆరోగ్య కార్యకర్తల వద్ద మందులను అందుబాటులో ఉంచాలని వైద్య సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి కమలహాసన్, సూపర్‌వైజర్లు ఝాన్సీరాణి, సులోచన, హెల్త్ అసిస్టెంట్లు విష్ణువర్ధన్ రెడ్డి, పాండరి, వేణుగోపాల్ రెడ్డి, ఏఎన్‌ఎం యాదలక్ష్మి, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

కొడవటూరులో డ్రైడే..

బచ్చన్నపేట: వర్షాకాలంలో అంటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నదున ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని స్పెషల్ ఆఫీసర్లు, పంచాయతీ కార్యదర్శులు సూచించారు. శుక్రవారం డ్రైడేను పురస్కరించుకుని వారు ఇంటింటికీ తిరుగుతూ నిలువ ఉన్న నీటిని పారబోశారు. నీటిగుంతలను పూడ్చారు. పిచ్చి మొక్కలు లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

'వర్ధంతి సభను జయప్రదం చేయాలి'

జనగామ రూరల్, జూలై 26: వీర తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటయోధుడు, జనగామ మాజీ ఎమ్మెల్యే ఏసిరెడ్డి నర్సింహారెడ్డి వర్ధంతి సభను జయప్రదం చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి జోగు ప్రకాశ్ కోరారు. సీపీఎం కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ జూలై 28న ఏసిరెడ్డి 33వ వర్ధంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని ప్రెస్టన్ గ్రౌండ్ నుంచి కామాక్షి ఫంక్షన్ హాల్ వరకు ర్యాలీ నిర్వహిస్తామన్నారు. కార్యకర్తలు, నాయకులు తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

'కుక్కల బెడదను నివారించాలి'

జనగామ రూరల్, జూలై 26: కుక్కల బెడదను నివారించాలని కోరుతూ అమ్మ ఫౌండేషన్ టీం సభ్యులు శుక్రవారం జనగామ మున్సిపల్ కమిషనర్ పి.వెంకటేశ్వర్లుకు వినతిప్రతం అందజేశారు. ఈ సందర్భంగా మంతెన మణి కుమార్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో కుక్కల బెడద తీవ్రంగా ఉందని, వాహనాలపై వెళ్తున్న వారిని వెంబడించి దాడి చేస్తున్నాయని వాటిని పట్టుకొని యానిమల్ బర్త్ కంట్రోల్ సర్జరీ చేసి రేబిస్ ఇంజక్షన్లు ఇవ్వాలని కోరారు.

'అర్హులైన రైతులందరికీ రుణమాఫీ'

జఫర్‌గడ్, జూలై 26 : అర్హులైన రైతులందరికీ పంట రుణాలు మాఫీ అవుతాయిన జఫర్‌గడ్ ఇంచార్జీ తహసిల్దార్ బాసెట్టి హరిప్రసాద్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస బ్యాంకులో ఆయన రుణమాఫీ వివరాలను బ్యాంకు మేనేజర్ ఆనంద్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. తొలి విడత రూ.లక్ష లోపు మొత్తం 638 మంది రైతులకు రూ.3.30 కోట్లు వచ్చాయని తెలిపారు. అయితే ఇప్పటి వరకు 300 మంది రైతుల ఖాతాల్లో మాత్రమే రుణమాఫీ డబ్బులు రూ.1.6 కోట్లు జమ చేశారని, మిగతా వారికి జమ చేసేలా చర్యలు తీసుకోవాలని బీఎంకు సూచించారు.

మేకల దొంగ అరెస్టు

జనగామ రూరల్, జూలై 26: మేకలు దొంగిలించిన నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని జనగామ సీఐ రఘుపతిరెడ్డి తెలిపారు. జనగామ పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ మాట్లాడుతూ జనగామ మునిసిపాలిటి పరిధి అంబేద్కర్‌నగర్‌కు చెందిన గూడెపు మహేశ్వరి, పిట్టల జంపన్న ఇంటిముందు కట్టేసిన 3 మేకపోతులను ఎత్తుకెళ్లగా బాధితుల ఫిర్యాదు మేరకు శుక్రవారం వాహనాల తనిఖీ చేపట్టామన్నారు. నవాబుపేట మార్కెట్‌లో మేకపోతులను అమ్మి వస్తున్న ఆటోను గుర్తించి అతడి వద్ద రూ.21 వేలు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఆటోను సీజ్ చేసి హనుమకొండ జిల్లా శాయంపేట మండలం కాట్రపల్లి గ్రామానికి చెందిన నిందితుడు చిన్న నర్సయ్యను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. సమావేశంలో కానిస్టేబుళ్లు టి.రామన్న, కరుణాకర్ పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులకు ప్రత్యేక కోటా ఇవ్వాలి



రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాతను సత్కరిస్తున్న జిల్లా ఆర్యవైశ్య సంఘం నాయకుడు మంతెన లవన్‌కుమార్ గుప్తా

చిలుపూర్, జూలై 26 : పేదరికంలో మగ్గుతున్న ఆర్యవైశ్య కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో ప్రత్యేక కోటా కేటాయించాలని సంఘం జిల్లా నాయకుడు మంతెన లవన్‌కుమార్ గుప్తా అన్నారు. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్‌లో రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కల్వ సుజాతను కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం త్వరలో చేపట్టనున్న ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డుల పంపిణీలో అర్హులైన ఆర్యవైశ్యులకు అవకాశం కల్పించాలని కోరినట్లు ఆయన పేర్కొన్నారు.

గిరిజనుల హామీలను నెరవేర్చాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న గిరిజన మోర్చా నాయకులు

జనగామ రూరల్, జూలై 26: రాష్ట ప్రభుత్వం గిరిజనులకు ఇచ్చిన హామీలను నేరవేర్చాలని డిమాండ్ చేస్తూ బీజేపీ గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు బానోత్ రాంకోటి డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం ఏవో రవీందర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గిరిజన మోర్చ రాష్ట అధ్యక్షుడు, జిల్లా ఇన్‌చార్జి భూక్య నరేష్ మాట్లాడుతూ ఎన్నికల ముందు గిరిజన బంధు, 12 శాతం రిజర్వేషన్, తండాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు, ఐటీడీఏ కేంద్రాల ఏర్పాటు, పోడు భూములకు పట్టాలు ఇస్తామని హామీలు ఇచ్చి ఇంతవరకు నేరవేర్చలేదని మండిపడ్డారు. వెంటనే హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ధరావత్ శ్రీను, కిషన్, చందర్, పరమేష్, పుప్పాల వేణు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

హాస్టళ్లలో ఎస్టీ విద్యార్థులకు సీట్లు ఇవ్వాలి

స్టేషన్‌ఘన్‌పూర్, జూలై 26: స్టేషన్‌ఘన్‌పూర్‌లోని ప్రభుత్వ ఎస్సీ, బీసీ, బాలుర, బాలికల కళాశాల హాస్టళ్లలో ఎస్టీ విద్యార్థులకు సీట్లు కేటాయించాలని కోరుతూ బీఆర్‌ఎస్వీ నియోజకవర్గ ఇంచార్జి లకావత్ చిరంజీవి ఆధ్వర్యంలో విద్యార్థులు శుక్రవారం ఆర్డీవో వెంకన్నకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ డివిజన్ కేంద్రంలో చదువుతున్న ఎస్టీ విద్యార్థులు దూర ప్రాంతాల నుంచి వచ్చి వెళ్లడం ఇబ్బంది అవుతోందని అన్నారు. అనంతరం డివిజన్ కేంద్రానికి వచ్చిన ఎమ్మెల్యే కడియంకు విద్యార్థి సంఘాల నాయకులు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్వీ మండలాధ్యక్షుడు బొంకూరి మహేష్, బానోత్ తిరుపతి, మహేందర్, నవీన్, అశోక్, తిరుపతి, వేణు, కుమార్, దినేష్, హరికృష్ణ, గోపి, ప్రవీణ్ పాల్గొన్నారు.

తాత్కాలిక రోడ్డుకు మరమ్మతులు

జనగామ రూరల్, జూలై 26: మండలంలోని వడ్లకొండ, గానుగుపహాడ్ శివారులో వాగుపై ఉన్న కల్వర్టు రెండేళ్ల క్రితం భారీ వర్షాలకు కొట్టుకుపోయింది. కొత్తగా చేపట్టిన బ్రిడ్జి నిర్మాణ పనులు కాంట్రాక్టరు నిర్లక్ష్యంతో నిలిచిపోయాయి. దీంతో ఆ మార్గంలో తాత్కాలిక రోడ్డు వేయడంతో ప్రయాణీకులు ఆ రోడ్డు పై నుంచి వెళుతున్నారు. కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు తాత్కాలిక రోడ్డు పూర్తిగా దెబ్బతింది. బస్సులు, ఇతర వాహనాలు, ప్రయాణీకులకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి. పరిస్థితిని తెలుసుకున్న జనగామ డీసీపీ రాజ మహేంద్ర నాయక్ ఆదేశాల మేరకు పోలీసుల ఆధ్వర్యంలో రోడ్డుకు మరమ్మతులు చేయించారు.

క్రీడలకు నిధుల కేటాయింపు పట్ల హర్షం

జనగామ కల్చరల్, జూలై 26: రాష్ట్ర బడ్జెట్‌లో క్రీడలకు ప్రభుత్వం రూ.325 కోట్ల నిధులు కేటాయించడం పట్ల జిల్లాలోని క్రీడా సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. ఈ మేరకు శుక్రవారం ధర్మకంచ మినీ స్టేడియంలో క్రీడా సంఘాల ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ చైర్మెన్ శివసేనరెడ్డి, రాష్ట్ర క్రీడల అడ్వైజర్ జితేందర్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి గంగిశెట్టి మనోజ్‌కుమార్, బాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు శాంసన్, గోపగోని సుగుణాకర్, కైరిక హనుమంతరావు, మునిసిపల్ వైస్ చైర్మన్ మేకల రాంప్రసాద్, న్యాయవాది మల్లయ్య, యాదవ సంఘం అధ్యక్షులు కానుగంటి శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

కిరాణ షాపుల్లో పోలీసుల తనిఖీలు

రఘునాథపల్లి, జూలై 26: మండలంలోని టోల్-ప్లాజా సమీపంలో వెంకటాయపాలెం వద్ద కిరాణం దుకాణాలలో పోలీసులు శుక్రవారం సాయంత్రం తనిఖీలు నిర్వహించారు. నూనెముంతల సరిత కిరాణం దుకాణంలో రూ.1500 విలువైన గుట్కా, అంబర్ ప్యాకెట్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ డి.నరేష్ తెలిపారు.

కిరాణా దుకాణంలో చోరీ..

పాలకుర్తి, జూలై 26 : మండల కేంద్రంలోని ఓ కిరాణం దుకాణంలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. పాలకుర్తి గ్రామ పంచాయతీ సమీపంలో ఉన్న కిరాణ దుకాణం యజమాని ఎస్. ప్రకాశ్ గురువారం రాత్రి తాళం వేసి వెళ్లగా శుక్రవారం వచ్చే సరికి తాళాలు పగులగొట్టి, తలుపులు తీసి ఉన్నాయి. షాపులో రూ.5 వేలు, ఇతర సరుకులు ఎత్తుకెళ్లారు. ఈ ఘటనపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసునమోదు చేశారు.

వాయిదా పడిన న్యాయ విజ్ఞాన సదస్సు

పాలకుర్తి, జూలై 26: ఈ నెల 27న బమ్మెర గ్రామంలో అగ్రి లీగల్ ఎయిడ్, నల్సార్ సంస్థ ఆధ్వర్యంలో జరిగే న్యాయ విజ్ఞాన సదస్సు వాయిదా పడినట్లు జిల్లా న్యాయ సంస్థ చైర్మన్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి డి. రవీంద్ర శర్మ శుక్రవారం తెలిపారు. తిరిగి ఎప్పుడు నిర్వహించేది తెలియజేస్తామని ప్రకటించారు.

కార్గిల్ అమరులకు నివాళులు



జఫర్‌గడ్‌లో కార్గిల్ అమరవీరులకు నివాళులు అర్పిస్తున్న బీజేపీ శ్రేణులు

జఫర్‌గడ్, జూలై 26 : కార్గిల్ అమర వీరులకు బీజేపీ నాయకులు నివాళులు అర్పించారు. కార్గిల్ విజయ్ దివస్‌ను పురస్కరించుకుని శుక్రవారం రాత్రి మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు కోరుకొప్పుల నాగేశ్ గౌడ్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు. అనంతరం గాంధీ సెంటర్ వద్ద అమరవీరులైన సైనికులకు నివాళులు అర్పించారు. సైనికుల త్యాగాలను స్మరించుకుంటూ.. దేశ భద్రత కోసం వారు చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు సింగారపు రమేశ్, మదన్‌మోహన్, మారెపల్లి రవి, గాదెపాక శ్రీను, పందిబోయిన రాజు, పల్లె సంతోష్‌రెడ్డి, దుద్దుల చంద్రమౌళి, సంగ గోపాల్, కుంభం చంద్రమౌళి, కట్ట సురేందర్, మొట్టెక ప్రేమ్‌కుమార్, పల్లా దయాకర్, యాదగిరి, చందా రాజు, మచ్చ బాబు, కత్తి సందీప్, నరేశ్, రాజు, రాకేశ్, తదితరులు పాల్గొన్నారు.

జఫర్‌గడ్ ఆదర్శ పాఠశాలలో..

జఫర్‌గడ్ ఆదర్శ పాఠశాలలో 'శిక్షా సప్తాహ్' కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం నైపుణ్యాలు, డిజిటల్ అంశాలతో పాటు కార్గిల్ విజయ్ దివస్ కార్యక్రమం నిర్వహించారు. ప్రత్యేకంగా తయారు చేసిన కార్గిల్ అమరవీరుల స్థూప చిత్రం వద్ద ఉపాధ్యాయులు, విద్యార్థులు నివాళులు అర్పించారు. సైనికుల సేవలు మరువలేనివని, వెలకట్టలేనివని అన్నారు. అనంతరం జరిగిన విద్యా నైపుణ్యాలు, డిజిటలైజేషన్ అంశాలపై ప్రిన్సిపాల్ దేవులపల్లి శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రస్తుత ఆధునిక కాలంలో వస్తున్న మార్పులకనుగుణంగా నైపుణ్యాలు పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు జానీనాయక్, మహేందర్, కందగట్ల గణేష్, నాగలక్ష్మీ, కిరణ్‌కుమార్, భూక్య నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకేంద్రంలో..

జనగామ కల్చరల్: జిల్లా కేంద్రంలోని శ్రీ అరబిందో ఉన్నత పాఠశాలలో కార్గిల్ విజయ్ దివస్ నిర్వహించారు. యుద్ధంలో అమరులైన 527 మంది జవాన్లను స్మరించుకొని రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం ప్రిన్సిపాల్ ఇ.ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో రిటైర్డ్ కల్నల్ డాక్టర్ మాచర్ల భిక్షపతిని సన్మానించారు. ఈ సందర్భంగా భిక్షపతి మాట్లాడుతూ విద్యార్థులు దేశసేవకు సంసిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.